సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



ఎయిర్‌పోర్టుపై తప్పుడు రాతలు
ఎల్లో మీడియా కడప ఎయిర్‌పోర్టుపై తప్పుడు రాతలు రాసుకుంటూ.. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంలో ముందు వరుసలో ఉంది. II- లో



ఫిర్యాదులపై స్పందించాలి
బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరమే స్పందించాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసులను ఆదేశించారు. II- లో

గరిష్టం/కనిష్టం
35.1 /24.0

వాతావరణం
జిల్లాలో సోమవారం 24.0 – 35.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలిలో తేమ మధ్యాహ్నం 65 శాతం మధ్య నమోదైంది. – కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ చేసేందుకు ఆసక్తిగల ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో డీజిల్ మెకానిక్ 47, మోటారు మెకానిక్ 8, ఎలక్ట్రీషియన్ 4, వెల్డర్ 1, పెయింటర్ 1, మిషనిస్టు 2, ఫిట్టర్ 2, డ్రాఫ్ట్ సివిల్ 2 కలిపి మొత్తం 67 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. నవంబరు 1 నుంచి 15వ తేదీలోగా అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటీస్‌షిప్.ఇండియా.జీఓవీ.ఇన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7382869399, 7382873146 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రూ.25కు చేరిన టమాట ధర



రైతు బజార్‌లో టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కడప అగ్రికల్చర్ : టమాట ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ. 8, 10 ఉండేవి. ఆదివారం రైతు బజార్‌లో కిలో రూ. 28 పలికింది. సోమవారం కిలో రూ. 25 చేరింది. దీంతో వినియోగదారుల్లో అందోళన మొదలవుతోంది. అలాగే ఉల్లిగడ్డల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం కిలో రూ.50 పలుకుతున్నాయి. ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారలు తెలిపారు. గత కొద్ది రోజుల నుంచి జిల్లాలో వర్షాలు సరిగా లేని కారణంగా జిల్లాలో ఉల్లి సాగు తగ్గింది. దీంతో ఉల్లిగడ్డల ధర క్రమేపి పెరిగిపోతోంది.

హెలిప్యాడ్ ఎంపికపై స్థల పరిశీలన
రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయచోటిలో పర్యటన నేపథ్యంలో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ కృష్ణారావు పలు ప్రాంతాలను పరిశీలించారు. అధికారులతో కలిసి వారు సోమవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాలను పరిశీలించారు. నవంబర్ నెల రెండోవారంలో రాయచోటిలో ముఖ్యమంత్రి పర్యటించే అవకాశం ఉంది. ఈ మేరకు రాయచోటిలోని అభి ఫంక్షన్ హాల్ సమీపంలో, ఇండస్ట్రియల్ ప్రాంతాలలో హెలిప్యాడ్ కోసం స్థలాలను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. నిబంధనలను అనుసరించి భద్రతాపరంగా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనపై అధికారికంగా సమాచారం అందాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ సూచించారు. అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, ఆర్డీఓ రంగస్వామి, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, తహసీల్దార్ హేమంత్ కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ సహదేవరెడ్డి, విద్యుత్‌శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సీఐ సుధాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కడపకు కొత్తరూపు

కడప నగరం రూపురేఖలు మారనున్నాయి. రోడ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ప్రతిరోడ్డు దాదాపు 80 అడుగుల మేర విస్తరించనున్నారు. డివైడర్ ఏర్పాటు, గ్రీనరీ, ఇరువైపులా ఫుట్‌పాత్, బటర్‌ఫ్లై లైట్లు, స్టోన్ క్లాడింగ్, బ్యూటిఫికేషన్ తదితర పనులు చేపట్టి ఇతర నగరాలకు దీటుగా కడపను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

- రూ. 120 కోట్లతో రోడ్ల అభివద్ధి పనులు
- సుందరంగా తయారు కానున్న జంక్షన్లు
- ఇప్పటికే పలు రోడ్ల విస్తరణ పనులు పూర్తి



కడపలోని అంబేడ్కర్ సర్కిల్‌లో జరుగుతున్న పనులు

కడప సిటీ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప నగర అభివద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆ దిశగా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇరుకురోడ్ల కారణంగా ట్రాఫిక్ సమస్య తరుచూ తలెత్తుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో కడప నగర పాలక సంస్థ రోడ్ల విస్తరణ పనులను అవసరం ఉన్న చోట చేపడుతోంది. కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ప్రతి మంగళవారం ప్రత్యేక డ్రైవ్ పేరిట పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తూ పనుల వేగవంతానికి చర్యలు చేపడుతున్నారు. కడప నగరాభివృద్ధిపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా సమీక్ష నిర్వహించే సమయంలో పలుమార్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నిధులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. దీంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని రోడ్లు విస్తరణకు నోచుకోగా, మరికొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయి. నగరంలో పాతవి, కొత్తవి కలిపి దాదాపు 12కు పైగా జంక్షన్లను అత్యంత సుందరీకరణతో తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పనులు కూడా చేపట్టారు.

రూ.120 కోట్లతో కడప రోడ్ల అభివద్ధి

కడప నగరంలో రోడ్ల విస్తరణకు సంబంధించి రూ. 120 కోట్లను ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. అందులో భాగంగానే పనులు కూడా కొనసాగుతున్నాయి. ఈ నిధులతో జంక్షన్ల అభివద్ధితోపాటు పలు రోడ్లను విస్తరణ చేయనున్నారు.

ఏయే రోడ్లంటే!

కడపలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఇరుకు రోడ్లను విస్తరించే పనులు చేపట్టారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే మహావీర్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ వరకు 400 మీటర్ల మేర, మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ మీదుగా రిమ్స్ ఆర్‌యూబీ వరకు 3.6 కిలోమీటర్ల మేర ఆరులేన్ల రోడ్డుగా తీర్చిదిద్దారు. ఇందుకుగాను రూ. 35 కోట్లు ఖర్చు చేశారు. అలాగే రాజీవ్ మార్గ్ రహదారిని 600 మీటర్లవరకు విస్తరించారు. ఈ రోడ్డు 80 అడుగుల మేర విస్తరణ చేపట్టారు. ప్రస్తుతం అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకు, కష్టా సర్కిల్ నుంచి గోకుల్ లాడ్జి వరకు, ఎస్పీ బంగ్లా నుంచి రాజారెడ్డివీధిలోని పెట్రోలు బంకు వరకు, రెండో గాంధీ బొమ్మ నుంచి బిల్టప్ వరకు (ఆర్‌అండ్‌బీ), అప్సర సర్కిల్ నుంచి సంజన్న సర్కిల్ (బైపాస్ స్మశానం వరకు) 80 అడుగుల వెడల్పుతో రోడ్లను విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో ఇప్పటికే కొన్ని రోడ్ల పనులు కొనసాగుతుండగా, మరి కొన్ని చోట్ల త్వరలో ప్రారంభం కానున్నాయి.

డిసెంబరు 23న సీఎంచే ప్రారంభోత్సవానికి సన్నాహాలు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిసెంబరు 23న జిల్లాకు రానున్న సందర్భంలో ఆయన చేతుల మీదుగా కడపలోని రెండు రోడ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకు ఉన్న రోడ్డు, కష్టా సర్కిల్ నుంచి గోకుల్ లాడ్జి వరకు ఉన్న రోడ్డును సీఎం ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కడప నగరంలో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్. ప్రతి మంగళవారం పనులు జరుగుతున్న ప్రాంతాలకు కాలినడకన వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రభాకర్‌నాయుడు, తహసీల్దార్ శివరామిరెడ్డి, డీఈ, సిబ్బంది కూడా ఆయనతోపాటు వెళ్లి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



కడపలోని శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో కొనసాగుతున్న పనులు



అన్నమయ్య సర్కిల్‌లో..



కడప వన్‌టౌన్ సర్కిల్ నమూనా

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం



జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను వివరించారు. పులివెందుల నుంచి అంకెవానిపల్లెకు సాయంత్రం బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని కోరారు. గాలివీడు నుంచి నూలివీడు మార్గంలో సాయంత్రం 4 గంటలకు, కోనంపేట నుంచి వేంపల్లెకు సాయంత్రం 5 గంటలకు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. బద్వేలు–పామూరు రూటులో తిరుగుతున్న బస్సులు కండీషన్‌లో లేవని ఫిర్యాదు చేశారు. సింహాద్రిపురం, వెలిదండ్లకు సాయంత్రం 5 గంటలకు, సింహాద్రిపురం నుంచి పులివెందులకు వయా కోవరంగట్టుపల్లె, బలపనూరు మీదుగా బస్సులను తిప్పాలని కోరారు. బద్వేలు–మార్కాపురం బస్సు ఏర్పాటు చేయాలని విన్నవించారు. వేంపల్లె–విజయవాడ సర్వీసు సమయపాలన పాటించేలా చూడాలని, కావలి నుంచి బెంగుళూరుకు వెళ్లే బస్సుల డ్రైవర్లు బద్వేలు వరకు మాత్రమే టిక్కెట్ ఇస్తున్నారని, కడప వరకు ఇవ్వాలని కోరారు. కడప–పామూరు, కడప–పామూరుకు బస్సు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ప్రయాణికుల సమస్యలు, సలహాలు, అభిప్రాయాలను తెలుసుకునేందుకు మంగళవారం సాయంత్రం 4 నుంచి 5.00 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. 995922 5774 నంబర్‌కు సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

ప్రొద్దుటూరులో లక్ష శివలింగాల తయారీ



శివలింగాలను తయారు చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : కాశీలో సమర్పించేందుకు ప్రొద్దుటూరు పట్టణంలోని సత్యారైస్‌మిల్‌లో లక్ష శివలింగాలను బాలాజీ సేవా సమితి అధ్యక్షురాలు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో భక్తులు తయారీ చేస్తున్నారు. మహిమాన్విత కాశీలో మహారాజా ఛేత్‌సింగ్ పిలిగ్రిమేజ్ సెంటర్ శివాలఘాట్‌లో కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 19 నుంచి 27వ తేదీ వరకు కోటి పార్థివ శివలింగాలకు అభిషేక అర్చనలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా హైదరాబాదులోని శ్రీ విజయానందనాథ గురు సేవా సమితి ఆధ్వర్యంలో శివలింగాలను రూపొందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన శివ సేవకులు సత్యనారాయణ, సరస్వతిలు వీటిని తయారు చేయడానికి అవసరమైన వస్తువులను పంపారు. కర్నూలుకు చెందిన ధనుంజయరెడ్డి, చెన్నూరుకు చెందిన అమరావతిల సహకారంతో పట్టణంలో చిన్న శివలింగాలను తయారు చేయిస్తున్నారు. అచ్చులతో ప్రతిరోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 7 వరకు దాదాపు 9 వేల శివలింగాలను మహిళలు, భక్తులు తయారు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి తెప్పించిన 25 బస్తాల మట్టి, సిమెంటు కలిపిన మెటీరియల్‌ను ఉపయోగించారు. రోజూ 50 నుంచి 70 మంది భక్తులు శివలింగాలను తయారీలో పాల్గొంటున్నారు. ఇప్పటికి దాదాపు 40 వేల దాకా తయారు చేశారు. ప్రొద్దుటూరులో దాదాపు లక్షకుపైగా శివలింగాలను రూపొందించాక ఊరేగింపు నిర్వహిస్తామని బాలాజీ సేవా సమితి అధ్యక్షురాలు లక్ష్మీదేవి తెలిపారు.

ప్రత్యేక పూజలు

స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి సోమవారం రాత్రి ఓంకారం సేవా మిత్రబృందం ఆధ్వర్యంలో దాదాపు 2 వేల శివలింగాలను శోభాయాత్రగా అగస్త్యేశ్వరాలయం వరకు తీసుకొచ్చారు. వీటికి ప్రత్యేక పూజలు చేశారు. తాము దాదాపు 10 వేల శివలింగాలను రూపొందించినట్లు ఓంకారం సేవా మిత్ర బృందం వారు తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ విజయరామరాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రతి సోమవారం 'స్పందన' కార్యక్రమంతో పాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ జి.గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వీరన్న, జిల్లా వ్యవసాయ అధికారి జేడీ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, హౌసింగ్, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు కృష్ణయ్య, యదుభూషణ్‌రెడ్డి, శ్రీలక్ష్మీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డా.రమాదేవి, ఎల్డీఎం దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్‌లో పెండింగ్ పనులు పూర్తిచేయాలి

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో పెండింగ్ లో ఉన్న హౌసింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభాభవన్ లో హౌసింగ్, జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్నకు చెబుదాం, వైద్యం, విద్య, ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, నాడు–నేడు పనుల పురోగతిపై.. క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను ఇప్పటికే మొదటి దశలో పూర్తి చేసి గృహ ప్రవేశాలు కూడా చేశారన్నారు. అదే స్ఫూర్తితో మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు సంబంధించి నివేదికలను, ఈ–కేవైసీ ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ యాప్ డౌన్ లోడ్, జగనన్న చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, వాహన మిత్ర, నేతన్న నేస్తం మొదలైన పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల అక్నాలడ్జ్మెంట్ డేటా పై సమీక్ష నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో సంతృప్త స్థాయిలో నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు వెంటనే పరిష్కార మార్గాలను చూపాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో పోలింగ్ స్టేషన్ల వారీగా సమస్యలను క్లియర్ చేయాలన్నారు. ఏ సమయంలో అయినా ఎన్నికల నిర్వహించేలా పోలింగ్ స్టేషన్లలో అన్ని రకాల సదుపాయాలను సంసిద్ధం చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు.సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకరెడ్డి అన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆరు రోజుల శిక్షణలో భాగంగా సోమవారం కడప లోని గ్లోబర్ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఆరు సంవత్సరాల వారంతా చిన్నపిల్లలేనని,వారికి ఆటపాటలు, కృత్యాలు, కథల ద్వారా బోధనలు చేసినట్లలైతే చక్కగా అవగాహన చేసుకుంటారన్నారు. కృత్యాల ద్వారా విద్యా బోధన జరిగినప్పుడే పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని, తద్వారా డ్రాపౌట్స్ స్థాయిని తగ్గించవచ్చన్నారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు అందరూ తప్పకుండా చదువడం, రాయడం, చదుర్విధ పక్రియలను చేయగలిగేలా చేయడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పర్యవేక్షకురాలిగా అకడమిక్ మానిటరింగ్ అధికారి ధనలక్ష్మి, ఏఏఎంఓ, రామాంజనేయలు, జీసీడీఓ విజయలక్ష్మి, కీ రీసోర్సు పర్సన్‌గా వరలక్ష్మి వ్యవహరించారు.

3 నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

కడప అగ్రికల్చర్ / కడప సెవెన్‌రోడ్స్ : రాయలసీమ పరిధిలోని నవంబర్ 3,4,5వ తేదీల్లో కర్నూలులోని రావూరి గార్డెన్స్‌లో జోనల్ స్థాయి (ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు) రొయ్యలు, చేపల ఫుడ్ ఫెస్టివల్ జరగనుందన్నారు. దీనిని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పిలుపునిచ్చారు. సోమవారం దీనికి సంబంధించిన పోస్టర్లను మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తోందన్నారు. వీరి కోసం అనేక రకాల సబ్సిడీ పథకాలను అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రజల్లో చేపల వినియోగాన్ని పెంచేందుకు మత్స్యశాఖ కృషి చేస్తోందన్నారు.

జిల్లాలో ఐదు జనరిక్ ఔషధి కేంద్రాలు

- సహకార సంఘాల్లో ఏర్పాటుకు చర్యలు వేగవంతం
- తక్కువ ధరకే అందనున్న జనరిక్ మందులు



జనరిక్ ఔషధి కేంద్రం ఏర్పాటు కానున్న లింగాపురంలోని వ్యవసాయ పరపతి సహకార సంఘం

కడప అగ్రికల్చర్ : కలుషిత ఆహారం, పంటల్లో పురుగు మందుల వాడకం కారణంగా రోగాలు పెరిగిపోతున్నాయి. దీంతో సామాన్యులు మందులు కొనే పరిస్థితి లేకుండాపోతోంది. ప్రజలకు మందుల ఖర్చులు తగ్గించేందుకు దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పుతోంది. వీటిని మరింత చేరువ చేసేందుకు రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో పల్లె ప్రజలకు తక్కువ ధరకే ఈ జనరిక్ మందులు అందనున్నాయి. వైఎస్సార్‌జిల్లాలో ఐదు ప్రాథమిక వ్యవసాయ పరిపతి కేంద్రాల పరిధిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఏ రోగానికైనా మార్కెట్‌లో లభించే మందుల ధరలతో తక్కువకు అందుబాటులోకి తేనున్నారు.ఈ జనరిక్ ఔషధి కేంద్రాల్లో అన్నిరకాల మందులు లభిస్తాయి. పేద ప్రజలకు మందుల ఖర్చు 50 నుంచి 80 శాతం మేర తగ్గనుంది. దీంతో ప్రజలు అనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

జిల్లాలో ఐదు షాపుల నిర్వహణకు సన్నాహాలను చేస్తున్నారు. ఇందులో పెండ్లిమర్రి మండలం వెల్లటూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార కేంద్రం, పులివెందుల మండలం ఎర్రపల్లె, పొద్దుటూరు మండలం లింగాపురం, మైదుకూరు, బి. కొడూరు మండలాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార కేంద్రాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నారు. ఇందుకు సంబంధించి కార్యాచరణను కూడా మొదలుపెట్టారు.

పేదలకు సాయం చేయడమే లక్ష్యం



ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘాల ఆధ్వర్యంలో జన ఔషధి కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. జిల్లాలో ఐదు షాపులు త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాం.వీటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మందుల కొనుగోలు ఖర్చు తగ్గుతుంది.

– కందుల రాజేంద్రకుమార్, డీసీసీ బ్యాంకు సీఈఓ, కడప

క్లుప్తంగా

ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంట పరిశీలన

ఓబులవారిపల్లె : మండలంలోని అటవీ సమీప గ్రామం వైకోట శివారులో ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి, మామిడి, టెంకాయ చెట్లను ఫారెస్టు రేంజర్ అధికారి రఘునాథరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి భాస్కర్ సోమవారం పరిశీలించారు. దాదాపు నాలుగు ఎకరాల అరటి పంట, ఎకరా మామిడి చెట్లు, రెండు బోర్లు ధ్వంసమయ్యాయి. రేంజర్ అధికారి రఘునాథరెడ్డి మాట్లాడుతూ అడవిలో నుంచి ఏనుగులు రాకుండా అటవీ సమీపంలో (టెంచింగ్ చేసి గుంతలు ఏర్పాటు చేశామని, అక్కడక్కడా దారి కోసం వదిలిన ప్రదేశాల నుంచి వస్తున్నాయన్నారు. అనంతరం ఉద్యానశాఖ అధికారి భాస్కర్ మాట్లాడుతూ రైతులు ఎస్.సుబ్బరత్నమ్మ, కొండేటి చలపతికి సంబంధించి పంట నష్టాన్ని నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, అటవీ శాఖ అధికారి మహేష్, సిబ్బంది జనార్దన్, వీఆర్‌ఓ సురేష్, ఉద్యానశాఖ సిబ్బంది యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మదనపల్లె : రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లె మండలం సీటీఎం రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. కదిరి మండలం బ్రాహ్మణపల్లె పంచాయతీ దిన్నెమీదపల్లెకు చెందిన రమణప్ప, రాజమ్మల కుమారుడు కేశవనాయుడు(22) గత కొంత కాలంగా తల్లిదండ్రులతో కలిసి మదనపల్లె చౌడేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా టమాట మార్కెట్‌లో పని చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కేశవనాయుడు సీటీఎం రైల్వేస్టేషన్ సమీపంలో గుంతకల్లు–తిరుపతి ప్యాసింజర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. రైలు కింద యువకుడు మృతి చెందిన సమాచారాన్ని స్థానికులు కదిరి రైల్వే పోలీసులకు తెలపడంతో.. హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. అనంతరం మృతదేహాన్ని కదిరికి తరలించారు.

చోరీ కేసులో జరిమానా

రాయచోటి : చోరీ కేసులో నలుగురికి రూ.2 వేల వంతున జరిమానా విధిస్తూ రాయచోటి అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.శారద తీర్పు ఇచ్చారు. సోమవారం న్యాయమూర్తి ఈ తీర్పును వెలువరించినట్లు రాయచోటి అర్బన్ ఎస్‌ఐ నరసింహారెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణం లక్ష్మీపురం పరిధిలో కేతిరెడ్డి రామనారాయణరెడ్డి నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలో ఆగస్టు నెల 10వ తేదీన రాత్రి సమయంలో టేకు వుడ్‌తోపాటు రూ.80 వేలు విలువ చేసే సామగ్రిని దోచుకెళ్లిపోయారు. రామనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు కొమ్మడి ఫయాజ్(27), సారకాయలపేర సయ్యద్‌బాషా(42), కోటకొండ గణేష్(23), షేక్ హుస్సేన్(36)ను అరెస్టు చేశారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎయిర్‌పోర్టుపై గాలి వార్తలు



కడప ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో సంస్థ విమానం


కడప విమానాశ్రయం ముఖద్వారం

- ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంలో ఎల్లో మీడియా
- వాస్తవాలను వక్రీకరించి దుష్ప్రచారం చేసేందుకు కంకణం

ఫ్యాక్ట్ చెక్

కడప సిటీ : ఎల్లో మీడియా కడప ఎయిర్‌పోర్టుపై తప్పుడు రాతలు రాసుకుంటూ.. రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంలో ముందు వరుసలో ఉంది. ఉన్న వాస్తవాలను వక్రీకరించి విమాన ప్రయాణికులను ఆందోళనకు గురిచేసే విధంగా వార్తలను ప్రచురిస్తున్నారు. విమానయాన సంస్థ ఇండిగో ఆదివారం నుంచి కడప–హైదరాబాదు విమాన సర్వీసులను నిలిపి వేసిందని, ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల వల్లనే నిలిచిపోయాయని చెప్పుకొచ్చారు. వాస్తవ పరిస్థితి చూస్తే.. నెట్‌వర్క్ ప్లానింగ్‌లో భాగంగా విమాన రాకపోకల షెడ్యూల్ మారుతుంటుందని ఇండిగో సంస్థ ప్రతినిధి 'సాక్షి'కి తెలిపారు. మార్చి 31వ తేది నుంచి యథావిధిగా ఈ సర్వీసు ఉంటుందని తెలియజేశారు. అంత వరకు కనెక్టింగ్ ఫ్లైట్ల ద్వారా కడప నుంచి హైదరాబాదుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్వసాధారణంగా ప్రతి ఫ్లైట్ సర్వీసు మార్చే క్రమంలో ఇలాంటి పరిస్థితి ఉంటుందని వివరించారు.

వక్రీకరించి...

పరిస్థితి ఇలా ఉంటే అందుకు భిన్నంగా ఎల్లో మీడియా వక్రీకరించి విషయాన్ని తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసింది. ఉన్న విషయాన్ని ప్రయాణికులకు చెప్పకుండా ఎయిర్‌పోర్టు ఉంటుందో? లేదోనన్న అపోహను కలిగించే విధంగా ప్రయత్నం చేశారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని, అందువల్లనే ఈ సర్వీసు రద్దు చేశారని రాసుకొచ్చారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంటే మొత్తం అన్ని విమాన సర్వీసులను రద్దు చేస్తారు గానీ.. కేవలం ఒకే ఒక సర్వీసును ఎలా రద్దు చేస్తారని పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని సెప్టెంబరు 15 వరకు విమానాలు నడుస్తాయని, ఆ తర్వాత బుకింగ్ ఉండదని రాశారు. కలెక్టర్ జోక్యంతో సెప్టెంబరు చివరి వరకు రాకపోకలు కొనసాగిస్తారని, అందులో వారే చెప్పారు. కానీ విమానాల రాకపోకలు ఆగిపోయింది లేదు.. ప్రయాణికులు ఇబ్బంది పడింది లేదు. నిరంతరాయంగా బుకింగ్ చేసుకుంటున్నారు. విమాన సర్వీసులు కొనసాగుతూనే ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే కేవలం ప్రభుత్వంపై చెడ్డపేరు తీసుకొచ్చి ప్రజల్లో ఒక విధమైన భావన కలిగించేలా చేసే ప్రయత్నమేనని పలువురు మండిపడుతున్నారు.

ప్రవీణ్.. నా కొడుకును ఎందుకు చంపమన్నావు?

బెనర్జీ తల్లి బుజ్జమ్మ ఆవేదన


మాట్లాడుతున్న బెనర్జీ తల్లి బుజ్జమ్మ

ప్రొద్దుటూరు : 'టీడీపీ నేత ప్రవీణ్‌రెడ్డి నా కుమారుడైన బెనర్జీని ఎందుకు చంపమని ఆదేశించావు.. మా వాడు ఏ పాపం చేశాడు. ఏ రోజు అయినా నీ జోలికి వచ్చాడా' అని వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెనర్జీ తల్లి బుజ్జమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఉద్దేశ పూర్వకంగానే బస్సు యాత్ర రోజున తన కుమారుడిని హత్య చేసేందుకు పురమాయించావన్నారు. నిత్యం ప్రవీణ్ వెంట తిరిగే భరత్‌కుమార్‌రెడ్డి ఆయన చెప్పందే ఈ విధంగా చేయడని తెలిపారు. ఎస్సీలమైన తాము రాజకీయాల్లో ఉండకూడదనేది మీ లక్ష్యమా అని ప్రశ్నించారు. మా కుమారుడు ఏమైనా మీ ఆస్తుల జోలికి, మీ కుటుంబ సభ్యుల జోలికి వచ్చాడా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కొడుకుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు. ప్రజలందరూ చూస్తుండగా పట్టపగలు జంతువులా తమ కుమారుడిని ఎలా నరికాడన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో తన కుమారుడు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని, వైద్యం కోసమే రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మానవతా హృదయంతో స్పందించి వైద్యానికి అయ్యే ఖర్చును భరిస్తానని తెలిపారన్నారు. సమావేశంలో బెనర్జీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరమే స్పందించి తగిన న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్పందన' ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితుల ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్‌లోని తమ వెబ్‌సైట్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌తోపాటు టోల్ ఫ్రీ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎస్పీ సూచించారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ : స్థానిక బీటీ కాలేజీ మైదానంలో నిర్వహిస్తున్న 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్ బాల్ అండర్–19 బాల,బాలికల పోటీలు సోమవారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గిరిజ, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజేతలు వీరే : అండర్–19 బాస్కెట్‌బాల్ బాలికల పోటీల్లో విన్నర్స్‌గా అనంతపురం, రన్నర్స్‌గా పశ్చిమ గోదావరి, మూడవ స్థానం ఈస్టు గోదావరి, 4వ స్థానం గుంటూరు జట్లు దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో విన్నర్స్‌గా తూర్పు గోదావరి, రన్నర్స్‌గా కృష్ణ, మూడవ స్థానం పశ్చిమ గోదావరి, నాల్గవ స్థానంలో విశాఖపట్నం నిలిచాయి.

రాష్ట్ర స్థాయి జట్టు వీరే

అండర్–19 బాస్కెట్‌బాల్ బాలుర జట్టులో ఉమామహేశ్వరరావు, ఫణీంద్ర, ఆదినారాయణ, నగేష్ బాబు, మస్తాన్, శ్రీవర్ధన్, సతీష్, అరుణ్‌పాల్, ప్రవీణ్, హేమంత ఆంటోని చైతన్య, మాధవ్, రమేష్ రెడ్డి, సిద్దార్థ, స్టాండ్‌బైలుగా రాజేష్, ఆకాష్, సాయిశ్రీ, వైష్ణవ్‌లు ఎంపికయ్యారు. బాలికల జట్టులో సోహాన, సాయి జ్యోతిక, పావనిప్రియ, పూర్ణచంద్రిక, అశ్రిత దీప్తి, సింధూర, వర్షిత, మైథిలి, లాలిత్య, రక్షణ కుమారి, శ్రీలత, మమత, స్టాండ్‌బైలుగా మమతారాణి, నికిలారెడ్డి, వైష్ణవిలు ఎంపికయ్యారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. క్రిష్ణానగర్ రెండో క్రాస్‌కు చెందిన శంకరయ్య భార్య వి.రాధ(36) స్థానికంగా ఓ నగల దుకాణంలో పని చేస్తోంది. వీరికి బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న కుమార్తె ఉంది. సోమవారం కుటుంబ సమస్యల కారణంగా నిద్రమాత్రలు మింగి ఇంట్లోనే ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మంటలు అంటుకొని గాయాలు

మదనపల్లె: వంటింటి పొయ్యి మంటలు అంటుకుని బాలిక గాయపడిన సంఘటన స్థానికంగా జరిగింది. చంద్రాకాలనీకి చెందిన నాగరాజు కుమార్తె ఎ.హిమజ(12) మతిస్థిమితం లేక అనారోగ్యంతో బాధపడుతుంది. ఆదివారం సాయంత్రం ఇంట్లో పొయ్యి వెలిగించి నాన్నమ్మ బయటకు వెళ్లింది. బాలిక కట్టెల పొయ్యి వెలిగిస్తూ ప్రమాదవశాత్తు మంటలు దుస్తులకు అంటుకుని తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ల చోరీ ముఠా అరెస్ట్

6 వాహనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్ : జల్సాలకు అలవాటు పడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బైక్‌ల చోరీకి పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను బి.కోడూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.50 లక్షల విలువ చేసే 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బద్వేలులోని డీఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన రసూల్, ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం మహమ్మదపురం గ్రామానికి చెందిన గుడిమెట్ల సుబ్బయ్య అలియాస్ చిన్నోడు, పల్నాడు జిల్లా బోర్లపల్లి మండలం యల్లటూరు గ్రామానికి చెందిన మన్నేపల్లి సాయికుమార్, కడప నగరం చిన్నచౌకు ఏరియాలోని గౌస్‌నగర్‌కు చెందిన సయ్యద్‌ఖలీల్ అనే యువకులు బేల్దారి పనులు చేసుకుంటూ దురలవాట్లకు లోనై.. గతంలో నేర నేపథ్యం ఉన్న సాయికుమార్ ప్రేరణతో ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతుండేవారు. గడిచిన ఆరు నెలల కాలంలో పల్నాడు, ప్రకాశం, కడప జిల్లాలలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ రాత్రి సమయంలో ఇంటి ముందు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాల హ్యాండిల్ లాక్ పగులకొట్టి బైక్‌లు చోరీ చేసేవారు. మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని మైదుకూరు టౌన్‌లో రెండు, బద్వేలు టౌన్‌లో ఒకటి, బి.కోడూరు మండలంలో ఒకటి, కడపలో ఒకటి, పల్నాడు జిల్లా వినుకొండలో ఒక బైక్ చొప్పున మొత్తం 6 వాహనాలు చోరీ చేశారు. బి.కోడూరులో జరిగిన చోరీ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బి.కోడూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ చంద్రశేఖర్, సబ్ డివిజన్ క్రైంపార్టీ బృందం నిందితులపై నిఘా ఉంచగా.. వారు కడప నుంచి ప్రకాశం జిల్లా వైపు వెళుతున్నట్లు సమాచారం రావడంతో బి.కోడూరు మండలం ఎర్రిఓబన్నబావి వద్ద అరెస్టు చేసి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన బద్వేలు రూరల్ సీఐ సుదర్శన్‌ప్రసాద్, బి.కోడూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ చంద్రశేఖర్, సబ్ డివిజన్ క్రైంపార్టీ ఏఎస్‌ఐలు రాంభూపాల్‌రెడ్డి, నాగేంద్ర, కానిస్టేబుళ్లు అమరేశ్వర్‌రెడ్డి, శివ, సిద్దారెడ్డి, ఖాజా, ఇతర సిబ్బందిని డీఎస్పీ వంశీధర్‌గౌడ్ అభినందించారు. సమావేశంలో బద్వేలు రూరల్ సీఐ సుదర్శన్‌ప్రసాద్, బి.కోడూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ చంద్రశేఖర్, రూరల్ ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు


ఎంపికలకు హాజరైన క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల క్రీడామైదానంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ మహిళల జట్టు ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డానియల్ ప్రదీప్, కార్యదర్శి ఎం.సుధీర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారిణులు నవంబర్ 2,3 తేదీల్లో గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లా క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్టును ప్రకటించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.థామస్, ఈసీ మెంబర్లు డానియల్ మైఖేల్, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

జిల్లా మహిళల జట్టు

శ్రీదేవి (కెప్టెన్), వెన్నెల, సావిత్రి, షాహినా, రోహితారెడ్డి, అంజనారెడ్డి, దుర్గా, మైథిలి, అశ్విని, శ్రీదేవి, చంద్రవదన, షణ్ముగ, హేమవందన, వర్షితారెడ్డి, సాహిత్య, గీతాంజలి, రెడ్డమ్మ, నిహారిక, సిరిచందన.

అవినీతి రహిత సమాజం నిర్మిద్దాం


విజిలెన్స్ అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మాసుంబాషా

కడప కోటిరెడ్డిసర్కిల్ : అవినీతి రహిత సమాజం నిర్మించడమే అందరి లక్ష్యం కావాలని రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, జిల్లా అడిషనల్ ఎస్పీ షేక్ మాసుంబాషా తెలిపారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు అక్టోబరు 30 నుంచి నవంబరు 5వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఏ అవినీతి తమ దృష్టికి వచ్చినా 970136 2590 నంబరుకు మిస్ట్ కాల్ ఇస్తే 24 గంటల్లోగా తిరిగి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, సీఐ రెడ్డెప్ప, ఏఈ జలహర్ రెడ్డి, డీఈఈ శ్రీనివాసులు, ఏజీ బాలగంగాధర్, వ్యవసాయాధికారి అశోక్‌కుమార్, ఏఈఈలు కేవీ కిశోర్, ఎన్‌జీ అజీముల్లా, ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

కడపలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంలోనూ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు అప్రమత్తత, అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు నుంచి ఐటీఐ సర్కిల్ వరకు అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్, జనరల్ మేనేజర్ సంజీవప్ప, రాజేంద్రన్, గిరి, చీఫ్ మేనేజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంక్‌లో..

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ ప్రధాన కార్యాలయం, బ్రాంచ్‌లలో సిబ్బందితో సీఈఓ కందుల రాజేంద్రకుమార్ అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బ్యాంకు సలహాదారు సహదేవరెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియుడి కోసం భర్తను చంపిన భార్య

- తాగి కిందపడి చనిపోయాడని నమ్మించే యత్నం
- అనుమానంతో నిలదీయడంతో వెలుగులోకి వాస్తవం
- పోలీసుల అదుపులో భార్య, ప్రియుడు


వెంకటశివ మృతదేహం వద్ద విచారణ చేస్తున్న వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా

మదనపల్లె : ప్రియుడిపై మోజుతో కట్టుకున్న భర్తను భార్య అంతమొందించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. కాగా అతిగా మద్యం తాగిన భర్త ఇంటి ముందు పడి చనిపోయాడని నమ్మించే యత్నం చేసింది. పాచిక పారకపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చి ప్రియుడితో సహా భార్య పోలీసులకు చిక్కింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలకడ మండలం ఎర్రకోటపల్లె పంచాయతీ సింగనొడ్డుపల్లెకు చెందిన రఘునాథ్, నారాయణమ్మ దంపతుల రెండో కుమారుడు డి.వెంకటశివ(42) రెండేళ్ల నుంచి తన భార్య రమణమ్మ(35)తో కలిసి మదనపల్లె రామిరెడ్డి లేఅవుట్ వినాయకుని గుడి వీధిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె కాగా ఆమెకు వివాహం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరూ స్థానిక టమాట మార్కెట్‌యార్డులో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో రమణమ్మ స్థానికంగా ఉంటున్న మరో యువకుడు గగన్(26)తో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లిన వెంకటశివ భార్య రమణమ్మతో గొడవపడ్డాడు. దీంతో ఆమె ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని, ఇంట్లోని రోకలిబండతో తలపై మోదింది. దీంతో వెంకటశివ అపస్మారకస్థితిలోకి వెళ్లగా.. ప్రియుడు గగన్‌తో కలిసి వైర్ సాయంతో గొంతుకు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఏమీ తెలియనట్లుగా... భర్త తరపు బంధువులకు ఫోన్ చేసి అతిగా మద్యం తాగి ఇంటి వద్దకు వచ్చి కిందపడి చనిపోయాడని సమాచారం అందించింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లుగా తెలిపింది. రాత్రికి రాత్రి స్థానికుడైన ఆటోడ్రైవర్ రవిని పిలిచి చనిపోయిన విషయం దాచిపెట్టి, భర్త తాగిపడిపోయాడని, ఇంటికి తీసుకెళ్లేందుకు సాయం చేయాల్సిందిగా కోరింది. సింగనొడ్డుపల్లెకు మృతదేహాన్ని తీసుకెళ్లింది. అక్కడ వెంకటశివ మృతదేహాన్ని పరిశీలించిన అతడి కుటుంబ సభ్యులు తలపై, మెడపై గాయాలను గమనించి, భార్య రమణమ్మను నిలదీశారు. దీంతో ఆమె అసలు విషయం చెప్పడంతో కుటుంబ సభ్యులు కలకడ పోలీసులకు సమాచారం అందించారు. కలకడ పోలీసులు హత్య సమాచారాన్ని మదనపల్లె వన్‌టౌన్ పోలీసులకు తెలపడంతో వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా మృతుడి స్వగ్రామం సింగనొడ్డుపల్లెకు వెళ్లి మృతదేహాన్ని, శరీరంపై గాయాలను పరిశీలించి, హత్య జరిగినట్లుగా నిర్ధారించుకున్నారు. శవ పంచనామా పూర్తిచేసి, మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనకు కారకులైన నిందితులు రమణమ్మ, గగన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి అన్న వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహబూబ్‌బాషా తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి


సిద్దేశ్వరమ్మ (ఫైల్)

కలసపాడు : మండలంలోని కొండపేటకు చెందిన ఓ మహిళ చెరువులో పడి మృతి చెందింది. ఎస్‌ఐ నాగమురళి తెలిపిన మేరకు.. పాలకొలను సిద్దేశ్వరమ్మ (42) మతిస్థిమితం లేక నాలుగు రోజుల నుంచి కనిపించకుండా పోయింది. బంధువులు గాలించినా ఆచూకీ తెలియలేదు. సోమవారం గ్రామం పక్కనే ఉన్న చెరువులో శవమై కనిపించింది. ఈమె భర్త 14 ఏళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తమ్ముడు పిచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన సబ్‌కలెక్టరేట్ సిబ్బంది

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని సిబ్బంది కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామసముద్రం గ్రామం ఆంజనేయస్వామి కాలనీలో తలారి శ్రీరాములు, భార్య లక్ష్మితో కలిసి కాపురం ఉంటున్నాడు. వీరికి సొంత ఇల్లు లేకపోవడంతో గతంలో రామసముద్రంలో చెక్‌పోస్ట్ సిబ్బంది ఏర్పాటు చేసుకున్న గుడిసెలో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో తనకు ఇల్లు మంజూరు చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను కోరితే రామసముద్రం వీఆర్వో సర్వే నంబర్: 33.3లో 5 సెంట్ల స్థలం చూపించాడని తలారి శ్రీరాములు తెలిపారు. అందులో తాము కాంపౌండ్‌వాల్ వేసుకుని గుడిసె ఏర్పాటు చేసుకున్నామన్నారు. అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు.. ఆ స్థలం తమదంటూ దౌర్జన్యం చేస్తూ గుడిసెను తగులబెట్టేశారన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తాను, తన కుటుంబం రోడ్డున పడ్డామని, తమకు న్యాయం చేయాల్సిందిగా ఆర్డీకు వినతిపత్రం సమర్పించాడు. ఈ విషయమై ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అర్జీదారుడైన శ్రీరాములు ఎదుటే రామసముద్రం తహసీల్దార్‌కు ఫోన్ చేసి అర్జీలోని విషయం తెలిపి వివరణ కోరారు. దీనిపై ఆయన తన దృష్టికి రాలేదని, అర్జీదారుడిని తన వద్దకు పంపితే న్యాయం చేస్తానని చెప్పారు. దీంతో తలారి శ్రీరాములను ఆర్డీఓ రామసముద్రం తహసీల్దార్ వద్దకు వెళ్లాల్సిందిగా చెప్పడంతో, అక్కడికక్కడే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన సబ్ కలెక్టరేట్ సిబ్బంది.. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్.లక్ష్మీ సూచనతో ఉప్పునీరు తాగించి పురుగుల నివారణ మందు కక్కించే ప్రయత్నం చేశారు. 108 వాహనానికి సమాచారం అందించి జిల్లా ఆస్పత్రికి పంపి వైద్య చికిత్సలు అందించారు.

హార్సిలీహిల్స్‌పైకి ఇసుక అక్రమ తరలింపు

బి.కొత్తకోట : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఏ నిర్మాణం జరిగినా టౌన్‌షిప్ కమిటీ అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా ఓ వ్యక్తి ఇసుకను కొండపై తరలించగా దాన్ని రెవెన్యూ సిబ్బంది సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన ఓ వ్యక్తి కొండపై ఓ సినిమా నటికి చెందిన అతిథి గృహాన్ని కొనుగోలు చేసినట్టు ప్రచారం ఉంది. అయితే ఈ వ్యవహారం కోర్టులో ఉన్నట్టు సమాచారం. ఈ అతిథి గృహానికి సంబంధించి పనులు చేపట్టేందుకు ఆ వ్యక్తి ఈ నెల 26న టిప్పర్‌లో ఇసుకను కొండపైకి తరలించుకొంటుండగా.. టోల్‌గేట్ వద్ద ఆపారు. నిర్మాణంలోని రెవెన్యూ అతిథిగృహం కోసం తరలిస్తున్నట్టు చెప్పడంతో సిబ్బంది నమ్మి పైకి పంపించారు. ఈ టిప్పర్ రెవెన్యూ అతిథిగృహం వద్దకు వెళ్లకుండా ఓ ప్రయివేటు అతిథి గృహంలోకి వెళ్లి ఇసుకను అన్‌లోడ్ చేసిన విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లింది. దీనితో అధికారుల ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది ప్రయివేటు అతిథి గృహం ఆవరణలో నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసి ట్రాక్టర్లతో రెవెన్యూ అతిథిగృహం వద్దకు తరలించారు. దీనిపై క్రిమినల్ కేసు నమోదు చేయించడంపై అధికారులు సమీక్షిస్తున్నారు.

1న జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక

రాయచోటి టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక చేయనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ రాం పురుషోత్తం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 31న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నీలకంఠ్రావుపేటలో అండర్ -14, 17 త్రోబాల్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 1న రాయచోటి మాసాపేటలో టెన్నికాయిట్ అండర్ -14, 17కు సంబంధించి ఎంపికలు జరుగుతాయన్నారు. 2న రాయచోటిలోని అలీమాబాద్ ఉన్నత పాఠశాలలో అండర్ -14 వాలీబాల్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. కడప ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.అరుణకుమారి, అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్సార్ జిల్లా
మంగళవారం ॥ 31-10-2023



విశిష్ట గాయని రావు బాలసరస్వతీదేవి వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోంది ప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.




• పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామ ఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయ వాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషా పరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



• భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. "నా పాటను వినడానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంబై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్



• బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక

ఆరోజు...
'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.
'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.
'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.
'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ–నామినేట్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'అవసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది.



• సుమధుర గాయనిగా...

యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్–బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.


గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మెకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మాస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్‌ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్‌ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు భేషైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్‌ఎహెచ్‌ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్‌ఎయు

సాగుబడి
స్వాతి కార్తె: నవంబర్ 6 వరకు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!



సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్‌ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్‌ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్‌ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్‌ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్‌ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్‌ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్‌ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజ్‌ల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్‌ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్‌ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్‌ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్‌ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



• బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు
• 5 రోజుల వయసులో పిల్ల పురుగులు
• గ్రాములో 3 వేల పిల్ల పురుగులు
• కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం
• ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం
• 15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్‌ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్‌ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్‌ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్‌ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్‌ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్‌ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్‌ఎఫ్ జాతికి వుంది. బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.



• బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– డా. వి. అనిత, కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్‌ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్‌ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్‌ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్లు, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయుట కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్‌ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్‌ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్‌ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్‌ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్